క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



మరికల్: కాంగ్రెస్‌తోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని జిల్లా కాంగ్రెస్ నాయకులు సూర్య మోహన్ అన్నారు. మండలంలోని పల్లెగడ్డలో సోమవారం ప్రత్యేక అధికారులచే సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే చొరవతో గ్రామాల్లో అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతతో చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరిష్, కృష్ణయ్య, రాజు, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, సూర్యప్రకాష్, వినతమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



మద్దూరు: మండల కేంద్రంలోని పారిశుద్ధ్య పనులను ఎంపీడీఓ జయరాములు సోమవారం పరిశీలించారు. పట్టణంలోని పాతబస్టాండ్ చౌరస్తాలోని మురుగు కాల్వలో మురుగును తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతూ.. పట్టణంలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పలు కాలనీలో నీరు నిలిచే చోట ఆయిల్ బాల్స్‌వేయాలని సూచించారు. అలాగే పాతఎండ్ల సంత కాలనీలో నీరు నిల్వ ఉండకుండా చేయాలని పంచాయితీ కార్యదర్శి శంకర్‌కు అదేశించారు.

ఆలయ నిర్మాణ పనులు వేగవంతం



మరికల్: మండల కేంద్రంలోని రాయిచూర్ రోడ్డు పక్కన దాతల సహకారంతో చకచక సరస్వతీ ఆలయ నిర్మాణ పనులు సాగుతున్నాయి. మండలంలో ఎక్కడ కూడా సరస్వతి ఆలయ లేకపోవడంతో మండలంలోని గ్రామస్తులు ఆలయ నిర్మాణానికి పూనుకోవడంతో పలువురు ఆలయ కమిటీ సభ్యులను అభినందిస్తున్నారు. త్వరగా పనులు పూర్తిచేసి విగ్రహ ప్రతిష్టాపనకు చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కళాకారులకు అభినందన



మక్తల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ కాళహస్తీశ్వరస్వామి ఆలయంలో మక్తల్‌కు చెందిన క్లాసిక్ డాన్స్ అకాడమి నాట్య గురువులు జోషి, హరతి గోపాలచార్య శ్రీకాళహస్తీలో నృత్య ప్రదర్శన చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆధ్యసహస్ర, ప్రతీక, నిహరిక, అక్షిత విద్యార్థులను అభినందించారు. రంజిత్‌రెడ్డి, మానస, నాగరత్న, వాణి, దినేస్, జయశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం తిప్పలు

- పడిపోతున్న భూ గర్భజల మట్టాలు..
- మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి కష్టాలు
- వ్యవసాయ బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు
- పట్టించుకుని పాలకులు, అధికారులు



అడవిసత్యరంలో వ్యవసాయ బోరు నుంచి నీటిని తీసుకొస్తున్న గ్రామస్తులు (ఫైల్)

మాగనూర్: వేసవికి ముందే మండలంలోని తాగునీటి సమస్య నెలకొంది. భూగర్భ జలాలు రోజుకు రోజుకు తుగ్గుముఖం పట్టడం.. నీటి వనరులు వట్టిపోవడంతో మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సమస్య మొదలైంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు నీటికోసం తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాగనూర్ మండలంలోని అడవిసత్యరంలో గత పదిరోజులుగా మంచి నీరు రాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి మంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సరఫరా కాకపోవడంతో మరింత ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్యలను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. వీటితోపాటు మండలంలోని మందిపల్లి, తళంకేరి, నేరడగండొడ్డి, ఉజ్జెల్లి, మాగనూర్ తదితర గ్రామాల్లో నీటి సమస్య నెలకొంది.

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ పైప్‌లైన్..

మండలంలోని పలు గ్రామాల్లో గతంలో వేసిన మిషన్‌భగీరథ పైపులైన్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా నీటి ట్యాంక్ వరకు నీరువస్తున్న ఇంటింటికీ మాత్రం నీరు చేరడం లేదు. ఇప్పటికీ కొన్నిచొట్ల ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇవ్వడంతో పలు గ్రామాలకు నీటి కష్టాలు మొదలయ్యాయి. కిలో మీటర్ల మేర దూరంలో ఉన్న వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పిడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇంటింటికీ నీరు చేరే విధంగా చూడాలని కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



మా కాలనీలో నీళ్ల కోసం ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి కోసం వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి తీసుకొస్తున్నాం. అధికారులు స్పందించి నీటిని సమస్యను తీర్చాలి.

\- వలిగే పద్మమ్మ, అడవిసత్యరం గ్రామం

సమస్య తీర్చాలి..



అడవిసత్యరంలో అధికారులు నీటి సమస్యను తీర్చాలి. మిషన్ భగీరథ నీరు రాక ఇబ్బందులు మరింత పెరిగాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి సమస్యను పరిష్కరించాలి

\- అంజప్ప, అడవిసత్యారం గ్రామస్తుడు

నీటి సమస్య పరిష్కరిస్తాం..



గ్రామంలో తాగునీటి సమస్య ఉన్న మాట వాస్తవమే.. అయితే ప్రస్తుతం గ్రామంలో మంచి నీటి కోసం రూ. 5లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభించి తాగునీటి సమస్య పరిష్కరిస్తాం.

\- జైపాల్‌రెడ్డి, ఎంపీఓ మాగనూర్

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న కార్మికులు

నారాయణపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మున్సిపల్‌పార్క్ వద్ద ధర్నా చేశారు. ఈ ధర్నాలో మధ్యాహ్నభోజన కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు.. గుడ్డుకు సపరేటు బడ్జెట్ కేటాయించాలని మధ్యాహ్నభోజన కార్మికులకు యూనిఫామ్స్ పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జోషి, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కోస్గిలో పశువులకు టీకాలు వేస్తున్న ఏడీ



మాగనూర్‌లో టీకాలు వేస్తున్న పశువైద్యసిబ్బంది

కోస్గి: ఉచిత పశువైద్య శిబిరాలను పాడి రైతులు, కాపరులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ ఏడీ మీరజ్ అహ్మద్ సూచించారు. ఈ మేరకు సోమవారం మండల పరిధిలో కొనసాగుతున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల పశువుల కాపరులు తమ జీవాలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. పశువుల్లో గర్భకోశ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ నెల 25వరకు కొనసాగే శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి విజయలక్ష్మీ, వీఏలు రాధ, దేవేందర్, పశువైద్య సిబ్బంది, గోపాల మిత్రలు, రైతులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్

మాగనూర్: సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వద్వాట్‌లో ప్రజలకు పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచిత వ్యక్తులు కాల్‌చేసి మీకు లాటరీలు తగిలాయని, మీకు లోన్స్ ఇస్తామని, తక్కువ ధరకే ఆన్‌లైన్ వస్తువులు వస్తాయని ఇలా వివిధ రకాలుగా మోసాలకు పాల్పడుతారని జాగ్రత్తగా ఉండాలి తెలిపారు. గ్రామంలో ఎవరైనా అపరిచిత వ్యక్తులపై అనుమానం ఉన్న వెంటనే డయల్ 100, మహిళా హెల్ప్ లైన్ నంబర్ 8712670398కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కళాబృందం సభ్యులు సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రూక్య నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



మహిళ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోస్గి: గుండుమాల్ మండల పరిధిలోని బోగారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రకాష్ రెడ్డి పాఠశాలలో ఉపాధ్యాయులకు అవసరమైన కుర్చీలను కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్‌షా సభను విజయవంతం చేద్దాం

నారాయణపేట రూరల్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్రను విజయవంతం చేద్దామని బీజేపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్ అన్నారు. జిల్లాలోని ఏడువందల పోలింగ్‌బూత్‌లు, అన్ని మండలాలు, గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు తరలిరావాలని కోరారు.

మాగనూర్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహిస్తున్న విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు గొల్ల నారాయణ ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి బూత్‌కమిటీ అధ్యక్షులు, మండల నాయకులు విధిగా హాజరై జయప్రదం చేయాలని తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..



బోయిన్‌పల్లిలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



మక్తల్‌లో..

నారాయణపేట రూరల్ : మండలంలోని బోయిన్‌పల్లి యూపీఎస్ స్కూల్‌లో సోమవారం విద్యార్థులే ఉపాధ్యాయులై స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. కలెక్టర్‌గా ఆకాష్, డీఈఓగా లక్ష్మి, ఎంఈఓగా అనసూయ, హెచ్ఎంగా చంద్రకళలు వ్యవహరించగా పలువురు టీచర్లుగా విధులు నిర్వహించారు. చక్కటి విద్యాబోధన చేసిన వారికి విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు హాజరై బహుమతులు అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బసదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మక్తల్: మండలంలోని జక్లేర్‌లో న్యూ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు సోమవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. చక్కగా బోధించిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. సిద్రాం, మహేష్‌గౌడ్, ప్రభావతి, రాధిక, అరుణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



మక్తల్: జిల్లాలో ఈ నెల 9, 10న నిర్వహించిన సైక్లింగ్ రేస్‌లో ప్రతిభ కనబర్చిన వారికి సోమవారం మల్లారెడ్డి, విజయ్‌కాంత్‌రావు, జానకిరాం, మనోహర్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గోపాలంను శాలువాతో న్మానం చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమరచింత: కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన వెంకటయ్య నాయక్ (50) గత నెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం..



భగవంతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న డీకే అరుణ

ఊట్కూర్: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటానని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీ.కే అరుణ అన్నారు. సోమవారం మండలంలోని ఇటీవల మృతి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యం. భాస్కర్ సోదరుడు భగవంతు కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అనంతరం బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొండయ్య, కర్నె స్వామి, మల్లికార్జున్, కల్లూరి నాగప్ప, కృష్ణయ్యగౌడ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



కోయిల్‌కొండ/బాలానగర్: పెబ్బేర్‌లో ఆదివారం జరిగిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బాలానగర్ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. మొత్తం 16 మంది విద్యార్థులు పాల్గొనగా లక్ష్మీప్రసన్న, నందిని గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించారు. ప్రిన్సిపల్ కృష్ణమూర్తి, పీఈటీ అరుణ, కరాటే మాస్టర్ కృష్ణయ్య తదితరులు విద్యార్థులను సోమవారం అభినందించారు.

మత్స్యకార్మికుల అభ్యున్నతికి కృషి



సంఘం అధ్యక్షుడు ఆంజనేయులును సన్మానిస్తున్న నర్సింహులునాయుడు

ధన్వాడ: మత్స్యకార్మికుల అభివృద్ధి కోసం కృషి చేస్తామని మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండలానికి వచ్చిన ఆయను జిల్లా మత్స్యకార్మిక సంఘం డైరెక్టర్ నర్సింహులునాయుడు ఆయనకు సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మత్స్య కార్మికుల అభివృద్ధికోసం కృషి చేయాలని కోరారు. అనంతరం కార్మిక డైరెక్టర్‌గా ఎంపికైన నర్సింహులు నాయుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చంద్రశేఖర్, కృష్ణయ్య, శ్రీనివాస్‌నాయుడు, రఘువేందర్‌నాయుడు, భగవంతు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ఆధారాలతో నిరూపిస్తాం



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

అమరచింత: మున్సిపాలిటీలో నాలుగేళ్ల నుంచి చేసిన అభివృద్ధి పనుల వెనుక అవినీతిని ఆధారాలతో నిరూపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఇందుకు చైర్‌పర్సన్ సిదద్ధంగా ఉన్నారో లేదో చెప్పాలని కౌన్సిలర్లు సవాల్ చేశారు. మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం కౌన్సిలర్లు మున్సిపల్ చైర్‌పర్సన్ చేసిన అవినీతిపై విలేఖరుల సమావేశం నిర్వహించి పలు విషయాలను వెల్లడించారు. నాలుగేళ్లలో ఏనాడు కౌన్సిల్ సమావేశంలో పెదవివిప్పి మాట్లాడలేని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ మున్సిపల్ అవినీతిపై చేసిన విమర్శలపై మొదటిసారి ప్రెస్‌మీట్‌లో మాట్లాడటం సంతోషమన్నారు. మున్సిపాలిటీలో ఇప్పటి వరకు రూ.18 కోట్లు మంజూరయ్యాయని, వీటితో మున్సిపల్ అభివృద్ధి అవుతుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రకటించారని, ఈవిషయాన్ని చైర్‌పర్సన్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు మరిచిన తాము మరువమన్నారు. మున్సిపాలిటీకి కేవలం రూ.10.50 కోట్లు మాత్రమే మంజూరయ్యాయని, వీటి ద్వారానే సుమారు రూ.9.50కోట్ల పైచిలుకు అభివృద్ధి చేశామని చైర్‌పర్సన్ చేసిన ప్రకటనపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలన్నారు. మున్సిపాలిటీకి రూ.18 కోట్ల నిధులు వచ్చాయని, వీటికి తమతో ఆధారాలు ఉన్నాయన్నారు. జనరల్ ఫండ్‌లో మున్సిపల్ అకౌంటెంట్ ఇచ్చిన లెక్కల ప్రకారం కేవలం రూ.20వేలు కూడా లేవని, చైర్‌పర్సన్ చూపిన లెక్కల ప్రకారం రూ.30 లక్షల నిల్వ ఎలా ఉందని ప్రశ్నించారు. ఆరు నెలలుగా మున్సిపల్ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఎందుకు వేధిస్తున్నారో సమాధానం చెప్పాలన్నారు. కార్మికులు వేతనాల కోసం సమ్మె చేస్తుంటే నెల రోజుల వేతనం కోసం కొత్తగా విధుల్లో చేరిన మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన చెక్కు డ్రా కాకుండా ఎందుకు బౌన్స్ అయ్యిందో వివరించాలన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్ పేరిట అక్రమం..

మున్సిపల్ టోల్‌ఫ్రీ నంబర్ అంటూ 14420 నంబర్ కోసం 2022లో రూ.22 వేలతో వీటిని మున్సిపల్‌లో అందుబాటులో ఉంచామంటూ ఇప్పటి వరకు వీటి నిర్వహణ కోసం రూ.96 వేలు ఖర్చు చేశారని లెక్కలు చూపిన చైర్‌పర్సన్, టోల్‌ఫ్రీ నంబర్ ఎక్కడుందో ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా రోడ్ డివైడర్ల నిర్మాణం కోసం రూ.36 లక్షలు వెచ్చించామంటూ, రూ.46 లక్షలు ఎందుకు డ్రా చేసుకున్నారన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ సొంతంగా మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతులకు రూ.5వేల ఖర్చు చేస్తే వీటికి మున్సిపల్ నుంచి రూ.75వేలు ఖర్చు పేరిట వాడుకున్నారని తెలిపారు. హరితహారం మొక్కల కొనుగోలులో అవినీతి ఉందని వీటిని ఆధారాలతో నిరూపిస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు మంగలావణ్య, సింధు, విజయరాములు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మరింత మేలు జరిగే అవకాశం ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, నాయకులు ఎస్‌పీ.వెంకటేశ్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడారు. ముదిరాజులను ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గత పాలకులు ముదిరాజ్‌లను నిర్లక్ష్యం చేశారని అన్నారు. అదేవిధంగా బీసీ–ఏలో చేర్చే విషయమై కమిషన్‌ను ఏర్పాటు చేసి పార్లమెంట్ ఎన్నికల్లోపే ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. మంత్రి పొన్నంకు వినతిపత్రం సమర్పించినట్లు వివరించారు.

బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణలో బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా గొర్రెల పెంపకం సహకార సంఘం చైర్మన్ శాంతన్న యాదవ్, మహబూబ్‌నగర్ వైస్ వైస్ ఎంపీపీ అనిత, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ వసంత నరసింహులుయాదవ్, రాంచంద్రపూర్ ఎంపీటీసీ లావణ్య వెంకటేశ్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ వార్డుల నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక కార్యాలయంలో పార్టీలో చేరిన సందర్భంగా మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర

- శివనామస్మరణంతో పులకించిన ఆత్మకూర్
- స్వామివారికి దాసంగాలు పెట్టి మొక్కులు



రథంపై కొలువుదీరిన స్వామివారు...



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: పట్టణంలోని చెరువు మధ్యలో వెలసిన స్వయంభూ పరమేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాదిమంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నాన్ని స్వామివారికి నైవేద్యంగా సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారులు కర్పసయ్య ఆధ్వర్యంలో జాతర కమిటీ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, కౌన్సిలర్లు చెన్నయ్య, మండ్లరామకృష్ణ, పోశన్న, అశ్విన్‌కుమార్, మహేశ్వరి, నాగలక్ష్మి, యాదమ్మ, తబస్సూం ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకుని పట్టణంలోని పురవీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ చేపట్టారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. రాత్రి రథోత్సవంపై పరమేశ్వరస్వామి విగ్రహాలు ఉంచి రథోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధ, గురువారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



స్వామివారికి దాసంగాలు తయారు చేస్తున్న భక్తులు



పల్లకీసేవలో స్వామివారు